

కురుస్తున్న వానలు..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈసీవాగు ఉప్పొంగింది. పంటలు నీట మునిగాయి.

8లో▸



'అభయహస్తం' అందేనా?

అభయ హస్తం పథకంలో భాగంగా తాము చెల్లించిన డబ్బులను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు.

8లో▸



రైతులు సహకరించాలి

ఎనికేపల్లిలో గోశాల ఏర్పాటుకు రైతులు సహకరించాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

సిటీ కమిషనర్‌కు సన్మానం



హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌తో బాలేశ్‌చారి

బడంగ్‌పేట్: ఓల్డ్ సిటీలోని అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, బీఆర్‌ఎస్ బడంగ్‌పేట కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేశ్‌చారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం బాలేశ్‌చారి మాట్లాడుతూ.. ఊరేగింపునకు పూర్తి సహకారం అందించిన సీపీ సీవీ ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు ఆసక్తి, అర్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శార్వాణి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇంగ్లిష్, తెలుగు, ఎకనామిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌లలో బోధించేందుకు పీజీ, పీహెచ్‌డీ అర్హత ఉన్న వారు అర్హులు అన్నారు. గురువారం సాయంత్రం లోపు అభ్యర్థులు నేరుగా తమ దరఖాస్తులను కళాశాలలో అందించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



రేషన్ కార్డులు అందజేస్తున్న కాలె యాదయ్య

చేవెళ్ల: అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రేషన్‌కార్డులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. బ్యానర్‌పై ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఫొటోలకు ప్రాధాన్యత ఇవ్వలేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ మరోసారి జరగకుండా చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, పీసీసీ నాయకుడు జనార్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేశ్, రాజశేఖర్, మధుసూదన్‌రెడ్డి, శంకర్, గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం

గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్



రవీందర్‌నాయక్‌తో గిరిజన నాయకులు

కడ్తాల్: తెలంగాణ మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ అన్నారు. బుధవారం నగరంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన గిరిజన ఐక్యవేదిక సభకు ఆయన ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హన్మానాయక్ మాట్లాడుతూ.. గిరిజన జనాభాలో మైదాన ప్రాంతమైన మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, హైదరాబాద్ జిల్లాల్లో 70 శాతం ఉన్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గిరిజనులకు పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరారు. బంజార, లంబాడ, ఎరుకలను ఎస్టీలుగా గుర్తించి, 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను నిర్వహించాలన్నారు. అనంతరం గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అఖిల భారత గిరిజన నాయకులు రవీందర్‌నాయక్‌ను కలిసి వివరించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు జగన్‌నాయక్, బీచ్యానాయక్, శంకర్‌నాయక్, భీముడునాయక్, రమేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సకుటుంబ సపరివారంగా.. ఓటరు జాబితా



ఒక కుటుంబ ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా ఏర్పాట్లు

- ఇప్పటికే సర్పంచ్ ఎన్నిక బ్యాలెట్ ముద్రణ
- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ నోటా

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేసింది. గ్రామ పంచాయతీలు, వార్డుల జాబితాను రూపొందించింది. ఇప్పటికే జీపీల వారీగా బీఎల్‌ఓలను నియమించింది. తాజాగా వార్డుల వారీగా కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఒక కుటుంబం ఓట్లు.. ఒకే వార్డు పరిధిలోనే వచ్చే విధంగా జాబితాను రెడీ చేస్తోంది. ఎన్నికల కమిషన్ నుంచి ప్రకటన వెలువడడమే ఆలస్యం.. నామినేషన్ల స్వీకరణ, ఓటింగ్ ప్రక్రియను మొదలు పెట్టనుంది. సర్పంచ్ ఎన్నికలు రెండు, మూడు విడతల్లో నిర్వహించనుండగా, పార్టీ గుర్తులపై జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ఒకే రోజు పూర్తి చేసే అవకాశం ఉంది. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ సైతం ప్రారంభమైనట్లు తెలిసింది. సాధారణ ఎన్నికల్లోనే మాదిరిగా స్థానిక సంస్థల ఎన్నికల బ్యాలెట్‌పైనా నోటాను ముద్రించనున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే.. నోటా మీట ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించింది.

పక్కగా వార్డుల విభజన

జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటి పరిధిలో

మండలాలు:	27
మున్సిపాలిటీలు:	15
మున్సిపల్ కార్పొరేషన్లు:	3
జెడ్పీటీసీ స్థానాలు:	21
పంచాయతీలు:	526
జనవరి నాటికి ఓటర్లు:	7,94,653

15 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. 21 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 230 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేసింది. 2019 ఎన్నికల్లో 257 ఎంపీటీసీ స్థానాలుండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీల ఏర్పాటు సహా గ్రేటర్ సమీపంలోని పలు గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ప్రస్తుతం 27 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. 558 గ్రామ పంచాయతీలుండగా, ప్రస్తుతం వీటి సంఖ్య 526కు తగ్గింది. వార్డులు 4,668కి చేరింది. జనవరి నాటికి వీటి పరిధిలో 7,94,653 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించింది. ఇప్పటికే సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వివరాలను పొందుపరుస్తున్నారు. దీంతో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వార్డుల విభజన పక్కాగా చేయడంతో పాటు కుటుంబ సభ్యుల ఓట్లు ఇతర వార్డుల్లోకి చీలకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అభ్యర్థుల వేటలో పార్టీలు

మెజార్టీ స్థానిక సంస్థలను చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోటీపడుతున్నాయి. సంస్థాగతంగా ఎవరికి వారు బలమైన అభ్యర్థులను నిలబెట్టడంతో పాటు వారి గెలుపునకు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జిగా అందెల శ్రీరాములును నియమించింది. ఆయన కందుకూరు, శంషాబాద్, మహేశ్వరం మండలాల్లో పర్యటించి, పార్టీ శక్తులను ఏకం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అధికార కాంగ్రెస్ మండల, గ్రామ, బూత్ కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ. అభ్యర్థుల గెలుపు బాధ్యతను పూర్తిగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకే అప్పగించింది. ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, రైతు భరోసా, గృహలక్ష్మి పథకాలే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధమవుతోంది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో మాత్రం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తోంది. కొత్త చేరికలతో పార్టీలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన ఎజెండాగా ప్రచారం చేస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా బలమైన అభ్యర్థులున్న చోట పార్టీ బీఫాంపై బరిలో దింపి, జిల్లాలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని భావిస్తోంది.

నేడు పత్రీజీ స్మృతి స్మరణోత్సవం

కడ్తాల్: మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం నిర్వహించనున్న పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలకు శక్తిస్థల్ సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలలతో పాటు, తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ధ్యానులు తరలిరానుండటంతో మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. పత్రీజీ శక్తి స్థల్, మహేశ్వర మహాపిరమిడ్‌ను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ధ్యానులకు ఇబ్బందులు కలగకుండా, భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక గురువుల సందేశాలు, ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణకు వీలుగా సభా వేదికను తీర్చిదిద్దారు.



విద్యుత్ దీపాల అలంకరణలతో పత్రీజీ శక్తిస్థల్

యూరియా దుర్వినియోగం చేస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి ఉష

నందిగామ: పరిశ్రమల నిర్వాహకులు వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను అనుమతులు లేకుండా ఇతర ఉత్పత్తుల తయారీకి ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని పరిశ్రమలను స్థానిక పోలీసు లు, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. ప్లైఉడ్ పరిశ్రమలు, మిల్క్ ప్రొడక్ట్ పరిశ్రమలు యూరియాను ఉపయోగించే అవకాశాలు ఉన్నందున తనిఖీలు చేపట్టామన్నారు. చట్ట వ్యతిరేకంగా యూరియాను ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఈ కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏఓ రామశివరావు, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్ ఏఎస్ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

భోజన నాణ్యతలో రాజీపడొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో రాజీపడొద్దని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్య, సంక్షేమశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి గృహాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెసిడెన్షియల్ పాఠశాలల్లో సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వసతి గృహాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార పదార్థాలను సురక్షిత ప్రదేశంలోనే నిల్వ చేయాలన్నారు. నిత్యవసరాల నాణ్యత ప్రమాణాల పరిశీలనకు ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి, వారికి మెరుగైన చికిత్సలు అందేలా చూడాలన్నారు. వసతిగృహాల ప్రాంగణాలతో పాటు పాఠశాల ఆవరణల్లో భారీగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ సుశీందర్‌రావు, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు నవీన్ కుమార్‌రెడ్డి, కేషురాం, రామేశ్వరీ దేవి, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి వెంక్యానాయక్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సివిల్ సప్లై అధికారులు పారిజాత, గోపికృష్ణ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

వనమహోత్సవం ఘనంగా చేపట్టాలి

ఏకధాటి వర్షాల నేపథ్యంలో జిల్లాలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంప్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, స్థానిక ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి వారం రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం నాటికి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష నగదు జమ చేయాలన్నారు. రేపటి నుంచి ఆగస్టు 10లోగా రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూడాలన్నారు. డెంగీ,



మహేశ్వరం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధిగా ఫాగింగ్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సంగీత, డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, హౌసింగ్ పీడీ హనుమంత్‌నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, సీపీఓ సౌమ్య, బీసీ సంక్షేమ అధికారి కేషురాం, ఉద్యాన శాఖ అధికారి సురేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్, కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

మహేశ్వరం: సాయంత్రం ఆయన మహేశ్వరం ఎస్సీ బాలికల వసతి గృహం, మహేశ్వరం గేటు వద్ద ఉన్న కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మహేశ్వరం బీసీ గురుకుల హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టళ్లలో వండిన కూరలు రుచిగా లేకపోవడం, మజ్జిగ నాణ్యతగా లేకపోవడం, వంట గదులు అపరిశుభ్రంగా ఉండడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వంటగదులు, స్టోరేజీ గది, డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని వార్డెన్లు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనంగా స్కావెంజర్లను నియమించి మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి లావణ్య, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

విద్యుత్‌లైన్ బాధితులకు పరిహారం పెంచాలి

కడ్తాల్: హైటెన్షన్ విద్యుత్‌లైన్ బాధిత రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 765 కేవీ బీదర్-మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారికి పరిహారం పెంచి ఇవ్వాలని కోరుతూ, బుధవారం ఆయన రైతులతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం అందజేయాలని లేదంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, రాములుయాదవ్, పెంటారెడ్డి, శ్రీరాములుగౌడ్, పర్వత్‌కుమార్, శ్రీశైలం, చంద్రశేఖర్ తదితరులున్నారు.

200 కోట్ల మంది ఉచిత ప్రయాణాలు

- లాభాల్లోకి ఆర్టీసీ
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేసిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని 200 కోట్ల మంది వినియోగించుకున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కల్వకుర్తి బస్టాండ్‌లో నిర్వహించిన సంబురాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కసిరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.6,680 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆర్టీసీ సంస్థకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరగడంతో నూతన బస్సులు కొనుగోలు చేశామన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, నాయకులు అయిల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, ఆనంద్‌కుమార్, అశోక్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, రేష్మ, కల్వకుర్తి ఆర్టీసీ డీఎం సుభాషిణి, అధికారులు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సంబురాలు చేసుకునే స్థాయికి ఆర్టీసీ

షాద్‌నగర్ రూరల్: మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణ పథకం ద్వారా 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డీఎం ఉష ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్లక్ష్యం చేయడంతో సంస్థ దివాలా తీసే స్థితికి వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వచ్చిన ప్రజాపాలనలో ఆర్టీసీని లాభాలలో బాటలోకి తెచ్చి డిపోల్లో సంబురాలు చేసుకునే స్థాయికి చేర్చామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, డిపో అభివృద్ధికి 53 నూతనంగా బస్సులను ఇప్పించామన్నారు. అనంతరం ఉచిత బస్సు సౌకర్యంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. మహిళలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ వెంకట్‌రాంరెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు అరుంధతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, ముబారక్‌అలీఖాన్, పురుషోత్తంరెడ్డి, అందె మోహన్, కృష్ణ, సీతారాం, నర్సింలు, అనిల్‌కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

- జిల్లా మత్స్యశాఖ ఏడీ పూర్ణిమ



మత్స్యకార మహిళా సంఘం సభ్యులతో పూర్ణిమ

కేశంపేట: మత్స్యకార సంఘం సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా మత్స్యశాఖ ఏడీ పూర్ణిమ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేటలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నిర్వహణపై సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ.. సభ్యులకు బ్యాంకుల నుంచి రుణాలను అందిస్తున్నామని.. పురుషులు, మహిళలు వేర్వేరుగా సంఘాలను ఏర్పాటుచేసుకుని ఈ రుణాలను పొందవచ్చని వివరించారు. సంఘంలోని సభ్యులందరికీ రూ.50 వేల చొప్పున బ్యాంక్ రుణాలను ఇప్పిస్తామన్నారు. మత్స్యశాఖ కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, లావణ్య, పద్మ, లలిత, తిరుపతమ్మ, జంగయ్య, శ్రీనివాసులు, శ్రీను, సుధాకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవన్‌లో జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చుకున్నాయని చెప్పారు. ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిజం, గతం వర్తమానం, భవిష్యత్ మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పులను వివరించారు. సీనియర్ జర్నలిస్టు ఉడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫేక్‌న్యూస్, సైబర్ క్రైం, సోషల్ మీడియా, ఫ్యాక్ట్ చెక్ వంటివి టెక్నికల్‌గా ఎలా ఉపయోగించాలో జర్నలిస్టులకు చెప్పారు. సీనియర్ జర్నలిస్టు గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. నేర వార్తల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం- 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్‌రావు, డీపీఆర్‌ఓ పీసీ వెంకటేశం. మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ప్రెస్ అకాడమీ ఎదుట ఆందోళన

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఏకపక్ష వైఖరి సరికాదని, అకాడమీ జర్నలిస్టులందరి కోసం పనిచేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ డిమాండ్ చేసింది. శిక్షణ తరగతుల్లో కొద్ది మందికే అవకాశం ఇవ్వడం, ఓ జర్నలిస్ట్ సంఘానికి అనుకూలంగా అకాడమీ వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల శిక్షణా తరగతులను నిర్వహించాల్సి ఉండగా ఓ యూనియన్ స్వలాభం కోసం వారి సహకారంతో మిగతా జర్నలిస్టు సంఘాలను తప్పుదోవ పట్టిస్తారా అని ఫెడరేషన్ సభ్యులు ప్రశ్నించారు. జర్నలిస్టుల ఆందోళనతో చివరకు అకాడమీ చైర్మన్ దిగొచ్చి, వారితో చర్చలు నిర్వహించడంతో సమస్య సద్దుమణిగింది.

‘అభయహస్తం’ అందేనా?

- ప్రీమియం డబ్బులు వడ్డీతో సహా తిరిగివ్వాలని మహిళల అభ్యర్థన
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1,18,712 మంది ఎదురుచూపు



మోమిన్‌పేట: అభయ హస్తం పథకంలో భాగంగా తాము చెల్లించిన డబ్బులను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు. ఈ స్కీమ్ ఆగిపోయి పదకొండేళ్లు కావస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అప్పట్లో డబ్బులు కట్టిన 1,18,712 మంది ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై సర్కారు నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో స్తబ్దత నెలకొంది. ఉద్యోగులు విరమణ పొందిన తర్వాత పెన్షన్ పొందుతున్న మాదిరిగానే సామాన్య, పేద మహిళలు కూడా వృద్ధాప్యంలో పింఛన్ తీసుకోవాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009లో అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. 18 ఏళ్ల పైబడి 59 సంవత్సరాల లోపున్న డ్వాక్రా సంఘాల్లోని మహిళలు దీనికి అర్హులని పేర్కొన్నారు. వీరు నిత్యం రూపాయి చొప్పున జమ చేస్తే.. ప్రభుత్వం తరపున రూపాయి జత చేస్తారు. ఇలా అర్హత ఆధారంగా 60 సంవత్సరాలు పైబడిన మహిళలకు ప్రతినెలా రూ.500 నుంచి రూ.5 వేల పెన్షన్ అందుతుందని ప్రభుత్వం అప్పట్లో ప్రచారం చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 1,18,712 మంది పథకంలో చేరారు. నాలుగేళ్లు సజావుగా సాగిన లావాదేవీలు ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత స్తంభించిపోయాయి. సభ్యుల నుంచి ప్రీమియం తీసుకోలేదు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2,575 మంది మహిళలు అభయహస్తంలో సభ్యులుగా చేరారు. 2012- 13 మార్చి నాటికి వీరు చెల్లించి ప్రీమియం సొమ్ము రూ.5 లక్షలకు పైగానే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ డబ్బులు తిరిగి చెల్లించాలని సభ్యులు కోరుతున్నారు.

ఆదేశాలు రాలేదు



అభయహస్తం ప్రీమియం డబ్బుల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గ్రామాలకు వెళ్తే తాము చెల్లించిన డబ్బులను వడ్డీతో కలిపి ఇవ్వాలని మహిళలు అడుగుతున్నారు.

– రాజు, ఐకేపీ ఏపీఎం, మోమిన్‌పేట

రౌడీషీటర్లు నేర ప్రవృత్తి వీడాలి

మహేశ్వరం ఏసీపీ జానకీరెడ్డి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ జానకీరెడ్డి

పహాడీషరీఫ్: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ జానకీరెడ్డి సూచించారు. బోనాలు, గణేష్ చతుర్థిని పురస్కరించుకొని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్‌తో కలిసి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, సామాన్యుల పట్ల గూండాయిజం చేస్తే ఉక్కుపాదంతో అణచి వేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాత్రిపూట రోడ్లపైకి రాకుండా ఇంటి వద్దే ఉండాలన్నారు. పోలీసులు ఎప్పుడు పిలిచినా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు. క్రమం తప్పని నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. సత్ప్రవర్తన అలవర్చుకుంటే రౌడీషీట్ ఎత్తేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్లాటు వివాదంలో రాజీవ్ కనకాలకు నోటీసులు

హయత్‌నగర్: ఓ ఇంటి స్థలం వివాదంలో సాక్షిగా హాజరు కావాలంటూ సినీ నటుడు రాజీవ్ కనకాలకు హయత్‌నగర్ పోలీసులు నోటీసులు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలోని సర్వే నంబర్ 421లో 230 గజాల ఇంటి స్థలాన్ని రాజీవ్ కనకాల సినీ ఇండస్ట్రీకి చెందిన విజయ్‌చౌదరికి విక్రయించారు. ఇతను తన పరిచయస్తుడు మనోజ్‌రెడ్డి ద్వారా సదరు ప్లాట్‌ను ఎల్‌బీనగర్‌కు చెందిన శ్రవణ్‌రెడ్డి అమ్మారు. అనంతరం ప్లాటు పొజిషన్ లేకుండా ఆనవాళ్లను తొలగించారు. దీంతో ఆందోళనకు గురైన శ్రవణ్‌రెడ్డి ప్లాటు విషయమై పలుమార్లు విజయ్‌చౌదరిని అడిగారు. ప్లాటు చూపకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ శ్రవణ్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్లాటు పూర్వాపరాలు తెలుసుకునేందుకు మొదటి ఓనర్ రాజీవ్ కనకాలకు నోటీసులు అందజేశారు.

నిష్ణాతులుగా తీర్చిదిద్దుతాం



కార్యక్రమంలో చాన్స్‌లర్ కోహ్లి, ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: గురునానక్ విద్యార్థులను ప్రపంచ స్థాయి ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యాబోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి అన్నారు. బీటెక్ విద్యార్థుల కోసం సాప్ భాగస్వామ్యంతో రూపొందించిన ఆధునిక కోర్సుల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వినయ్ చోప్రా మాట్లాడుతూ.. ఉద్యోగావకాశాలు మెరుగుపర్చేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని తెలిపారు.



మొయినాబాద్: అమ్డాపూర్ వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న ఈసీ వాగు

కురుస్తున్న వానలు..
పొంగిన వాగులు

ఉగ్రరూపం దాల్చిన ఈసీ వాగు

మొయినాబాద్/షాబాద్/మొయినాబాద్‌రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈసీవాగు ఉప్పొంగింది. మొయినాబాద్ మండలంతో పాటు చేవెళ్ల, షాబాద్, కొందుర్గు, వికారాబాద్ జిల్లాలోని పరిగి, పూడూరు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో బుధవారం ఉదయం మండల పరిధిలోని అమ్డాపూర్ వద్ద ఈసీవాగు ఉప్పొంగి ప్రవహించింది. పంట చేళ్లు నీటమునిగాయి. ఈసీ వాగులో వచ్చిన వరదతో హిమాయత్‌సాగర్ జలాశయంలో నీటి మట్టం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



షాబాద్: తాళ్లపల్లి వద్ద ఉగ్రరూపం



షాబాద్: తిమ్మారెడ్డిగూడ ఈసీ వాగు ప్రవాహం



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ సమీపంలో నీట మునిగిన గులాబీ తోట



మొయినాబాద్‌రూరల్: వాగులో వరద ఉధృతి

SCIENT INSTITUTE OF TECHNOLOGY
(Approved by AICTE, Affiliated to JNTUH and Accredited by NAAC with A+ Grade)
AN UGC AUTONOMOUS INSTITUTION
Ibrahimpatnam, R.R. Dist-501506. Ph: 9849068863, Email: scient_insteng@yahoo.co.in
A+ NAAC
SPOT ADMISSIONS TGECET - 2025
Eligible Candidates can attend for the spot admissions with all original certificates in the college premises on 26/07/2025. Admissions will be made as per TGECET-2025 Convenor guidelines.
B.Tech (LES) - CSE, ECE, EEE, CSM & AIML
Sd/-Principal

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ LinkiT Aviation Academy, Begumpet - Our Courses: Aviation Tourism & Hospitality, Ground Handling, Airport Terminal Ops, Personality Development, Customer Service, Air Ticketing. Call: +91 9000030263 www.linkitaviation.com [HA-16230]

Real Estate

LAND FOR SALE
■ మన తెలంగాణ జగిత్యాల జిల్లాలో వ్యవసాయ భూమి శ్రీ గంధం మొక్కలతో అర ఎకరం 10లక్షల రూ॥ మాత్రమే ఆఫర్ ఒక్క నెల రోజులు మాత్రమే. 9515999718 [SCA25006381]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800535]

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-482]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Nathi Bai D/o. Ramanuja Sarada R/o. 14-6-264, Chudi Bazar, Goli Basthi, Nampally, Hyderabad- 500012, has changed my name from Nathi Bai to Priyanka for all records [HA-01143]

■ I, Aradhana Reddy Pollreddy W/o, Vangapati Anvesh R/o Flat G2, Plot 1717, Nirvana Heaven, Pragathi Nagar, Hyderabad-500090 have changed my name to Pollreddy Aradhana. [DA-44721]

■ I, Kondala Pdmanabham Jalaja W/o. Kondala Rama Krishna Padmanabham Naidu R/o.1-4-887/1 and 2, Flat-204, Sri Sai Rajendra Pride, Bank of Baroda Colony, Gandhi Nagar, Hyderabad-80, Telangana. Has Changed my name as Kondala Padmanabham Jalaja Naidu [HA-01150]

LOST
■ I, VARKALA SRISAILAM, S/o VARKALA PEDDA YADAIAH, R/o, 3-69/6, Anajipur, Hayathnagar, Abdullapurmet(M), RangaReddy (D), T.G-501 512, MY Original PassPort No:V3775216, That the Said Document Was Lost. While Travelling Bike. If Any Found Please Call.9391029595 [SCA25006611]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783379]

Wanted

■ Waves Water Purifier Co. Req. Male Sales Executives, Service Technicians & Lady Telecallers. 6281547216/9502536969 [HA-15100]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-2491, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

‘నవోదయ’లో క్లస్టర్ స్పోర్ట్స్ మీట్

హాజరైన వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. తొలుత ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు క్రీడా పతాకాన్ని ఎగురవేయగా, క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ఉన్నత స్థాయికి చేరొచ్చని చెప్పారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభ చాటిన 250మందిని రీజినల్ స్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

345 మంది క్రీడాకారులు

పాలేరు నవోదయలో మొదలైన క్లస్టర్ స్థాయి పోటీలకు పాలేరుతో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నవోదయ విద్యాలయాల విద్యార్థులు 345 మంది హాజరయ్యారు. ఇందులో 183 మంది బాలురు, 162 మంది బాలికలు ఉన్నారు. వీరికి అండర్–14, 17, 19 విభాగాల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, ఖో–ఖో, యోగా పోటీలు నిర్వహిస్తుండగా గురువారంతో ముగియనున్నాయి.

విద్యార్థులకు నచ్చేలా వండాలి

తెలంగాణ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నాగార్జునరావు

మహేశ్వరం: హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలంగాణ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పుగడ్డతండా సమీపంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో హాస్టళ్లలో పని చేస్తున్న వంట మనుషులకు(హెడ్ కుక్) శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తినడానికి ఇష్టపడని కూరగాయలను కూడా వారికి నచ్చేలా వంట చేయాలన్నారు. వండేటప్పుడు కూరగాయలు, ఆకుకూరలను ఉప్పునీటిలో అరగంట నానబెట్టి శుభ్రంగా కడగాలని సూచించారు. హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం గిరిజన గురుకుల హాస్టల్ ప్రిన్సిపాల్ ఎస్.నళినిమోహన్, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్ హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు బి.బాలాజీ, యాదగిరి, నాలుగు జిల్లాల హెడ్‌కుక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఒకరికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు, విరిగిపడిన స్తంభం

మొయినాబాద్: అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 8 గంటలకు లింగంపల్లి నుంచి అమ్డాపూర్ వైపు వెళ్తున్న కారు కాశీంబౌలి గేటు మూలమలుపు వద్ద అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పోల్ విరిగిపడింది. కారు పల్టీలు కొడుతూ కిందికి దూసుకెళ్లి ఆగిపోయింది. కారు ఢీకొట్టగానే విరిగిన స్తంభం తీగల నుంచి వేరుకావడంతో స్తంభం మాత్రమే కిందపడింది. లేదంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని మరో చోటకు మార్చాలని కోరారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: వేగంగా వచ్చిన కారు లారీని ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అతను బడంగ్‌పేట్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో బాబుల్‌రెడ్డినగర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో శ్రీనివాస్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీలో ఇరుక్కుపోయిన కారును జేసీబీతో బయటికి లాగారు. గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఠాగా ఏర్పడి.. మొబైళ్లు కొట్టేసి



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు

- చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు
- రూ.50 లక్షల విలువైన 473 ఫోన్‌లు స్వాధీనం

మీర్‌పేట: రద్దీ ఉన్న ప్రాంతంలో సంచరిస్తూ మొబైల్ ఫోన్‌లు చోరీలకు పాల్పడుతున్న 5 మంది అంతర్రాష్ట్రంలోని ముఠాలోని మహిళా నేరస్తురాలితో మరో ముగ్గురిని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, మీర్‌పేట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.50 లక్షల విలువైన 473 మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ నందనవనానికి చెందిన గారేడి మహేష్, భూషేష్‌గుప్తానగర్ కాలనీ చెందిన సల్లంగుల నరేష్, ఏపీలోని అనంతపురానికి చెందిన కుమ్మరి గోపి అలియాస్ ఆకుల గోపి, కర్నూల్‌కు చెందిన నగునూరి నాగమణి, ఆమె భర్త నగునూరి సాయికుమార్ మీర్‌పేట్‌లోని భూషేష్ గుప్తా నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. సాయి కుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా వీరందరూ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ముందు చేసుకున్న ప్లాన్ ప్రకారం రద్దీగా ఉండే బస్సు స్టాప్‌లు, కూరగాయల మార్కెట్లు, దుకాణాలు, కూరగాయలు కొనుగోలు చేసే వ్యక్తులను ఎంపిక చేసుకుంటారు. బస్సుల్లో ఎక్కుతారు. నరేష్, గోపిలు వారు ఎంపిక చేసుకున్న వ్యక్తులను బస్సులో నెట్టి వేస్తుంటారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్‌లను కొట్టేస్తారు. చోరీ చేసిన ఫోన్‌లను నాగమణి, సాయికుమార్‌లకు అందజేస్తారు. వారు ఇతర ప్రాంతాల్లో విక్రయించి వచ్చిన డబ్బులను అందరూ సమానంగా పంచుకుని విచ్చలవిడిగా ఖర్చు చేశారు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట్, మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు దర్యాప్తు చేపట్టి ముఠాలోని నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 470 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాలలో పలు దొంగతనాలు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో మీర్‌పేట్, ఎస్‌ఓటీ పోలీసులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్ట్

ఉప్పల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసి రూ. లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని ఉప్పల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి ప్రాంతానికి చెందిన గిన్ని గోపి ఉప్పల్ ప్రాంతంలో లెన్స్ సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నకిలీ కంపెనీ పేరుతో నకిలీ లోగో సృష్టించి ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి రూ. లక్షలు వసూలు చేసి వారికి నకిలీ ఆఫర్ లెటర్‌లు ఇస్తున్నాడు. వారు ఆఫర్ లెటర్లు తీసుకుని లెన్స్ సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లడంతో తాము ఎలాంటి లెటర్లు ఇవ్వలేదని తెలిపారు. కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు గిన్ని గోపిగా గుర్తించారు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసులపై దాడి కేసులో నిందితుల రిమాండ్





నిందితులు శివ, లక్ష్మణ్

ఉప్పల్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసినా, విధులకు ఆటంకం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ డీఐ రామలింగారెడ్డి అన్నారు. ఈ నెల 20న రాత్రి రామంతాపూర్ బోనాల పండుగ ఫలహార బండ్ల ఊరేగింపు సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న ఉప్పల్ ఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ లకన్‌పై కొందరు యువకులు మద్యం మత్తులో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితులను భువనగిరి, రాజాపేటకు చెందిన ఇరానీ లక్ష్మణ్, అదే ప్రాంతానికి చెందిన నాగని శివ మనోహర్‌గా గుర్తించిన పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా ఫలహార బండ్ల ఊరేగింపులో నిర్లక్ష్యంగా కారు నడిపిన మామిడాల క్రాంతిని సైతం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

రైతులు సహకరించాలి



ఎనికేపల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

- చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ
- పోలీసుల బందోబస్తు నడుమ రైతులతో రెవెన్యూ అధికారుల ముఖాముఖి

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి సర్వే నంబర్ 180లో 99.14 ఎకరాల్లో ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు నిర్ణయించిందని.. ఇందుకు రైతులు సహకరించాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. బుధవారం ఆమె మొయినాబాద్ తహసీల్దార్‌తో కలిసి పోలీసు బందోబస్తు నడుమ రైతుల దగ్గరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారంగా 300 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు అందజేస్తుందని వివరించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. 300 గజాల స్థలాన్ని తమకు అనుకూలంగా ఉన్న చోట ఇవ్వాలని నిర్వాసితులు కోరారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు నడుచుకుంటూ రైతులకు న్యాయం చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, రాజేంద్రనగర్ ఏసీపీ రమణగౌడ్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం నాయకురాలు పద్మ

మొయినాబాద్: 40 ఏళ్లుగా భూములు సాగుచేసుకుంటున్న ఎనికేపల్లి రైతులకు ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకురాలు పాశ్య పద్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లిలో రైతులు చేపడుతున్న రిలే నిరహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రైతులను బలవంతంగా వెళ్లగొట్టొదన్నారు. ఈ విషయాన్ని జాతీయ ఎస్సీ కమిషన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ప్రభులింగం, సంధ్య, నరేంద్రప్రసాద్, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఈశ్వర్, సికిందర్, మహేందర్, వరుణ్ తదితరులు ఉన్నారు.

జోనల్ కార్యాలయంలో చిల్లర దొంగ వీరంగం

కంప్యూటర్ వైర్లు కత్తిరించడంతో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం



ధనుంజయ్

మూసాపేట: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఓ చిల్లరదొంగ వీరంగం సృష్టించాడు. వెయిటింగ్ హాల్‌లో ఉన్న సర్వర్, ఇంటర్‌నెట్ వైర్లను కట్ చేయటంతో బుధవారం మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిల్ కార్యాలయాలతో పాటు, జోనల్ కార్యాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. మున్సిపల్ అధికారులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ధనుంజయ్ అనే వ్యక్తి గత కొన్నాళ్లుగా జోనల్ కార్యాలయంలో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బాత్‌రూమ్‌లలో నల్లాలు, పైపులు, తదితర వస్తువులు చోరీ చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. బుధవారం తెల్లవారు జామున మున్సిపల్ కార్యాలయంలోకి ప్రవేశించిన అతను వెయిటింగ్ హాల్‌లోని కుర్చీలను, టేబుళ్లను చిందర వందర చేసి, ఇంటర్నెట్ మెయిన్ సర్వర్ వైర్లను, కంప్యూటర్ వైర్లను కట్ చేశాడు. దీనిని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది అతడిని పట్టుకుని అక్కడే కట్టేశారు. తర్వాత కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అతడి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.